# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-10-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నగరపాలక, పురపాలక, నగర పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభం కానుంది.**

**2. ఎల్‌నినో ప్రభావాన్ని అందరూ కలసి సమష్టిగా ఎదుర్కోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.**

**3. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు 28 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా ఎన్నికల సంఘం నియమించింది.**

**4. మాదకద్రవ్యాల నుంచి యువత దూరంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సూచించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభం కానుంది. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులతో పాటు కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5 వేల 485 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ పుర కమిషనర్లతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కాగా రాష్ట్రవ్యాప్తంగా 13 నగరపాలక సంస్థలు, 77 పురపాలక సంఘాలు, 10 నగర పంచాయతీలకు ఈ నెల 28న పోలింగ్ నిర్వహించనుండగా ఈ నెల 30న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

--------------------------

ఎల్‌నినో ప్రభావాన్ని ప్రజలు, రైతులు అందరూ కలసి సమష్టిగా ఎదుర్కోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిన్న నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్ర జలాశయాల్లో 460 టీఎంసీలకు గానూ 209 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, 251 టీఎంసీల లోటు ఉందని తెలిపారు.

తాగునీటికి తొలి ప్రాధాన్యమివ్వాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. యాసంగిలో ముఖ్యంగా వరి సాగును తగ్గించుకోవాలని రైతులను కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తెలుగు దేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు ఏ స్థానం నుంచి ఎవరు పోటీ చేయాలనే అంశంపై ఎన్డీయే కూటమి గత రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం 17 నగరపాలక సంస్థల మేయర్ పదవులకు గానూ టిడిపి 11 చోట్ల, జనసేన నాలుగు చోట్ల, బిజెపి రెండు చోట్ల పోటీ చేయనున్నాయి. ఇక పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్ పదవులకు టిడిపి78 స్థానాల్లో, జనసేన 21 స్థానాల్లో, బిజెపి ఏడు స్థానాల్లో పోటీచేయనున్నాయి. మొత్తంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో టిడిపి 89 చోట్ల, జనసేన 25 చోట్ల, బిజెపి తొమ్మిది చోట్ల పోటీ చేయనున్నట్లు కూటమి నేతలు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల తొలి జాబితాను నిన్న ప్రకటించింది. 13 నగరపాలక సంస్థలకు గానూ ఏడు కార్పొరేషన్లకు పార్టీ అభ్యర్థులను వెల్లడించింది. చిత్తూరు, తిరుపతి, అనంతపురం, విజయవాడ, గుంటూరు, కర్నూలు నగరపాలక సంస్థల మేయర్ అభ్యర్థులతో పాటు, మరికొన్ని మున్సిపాలిటీల ఛైర్మన్ అభ్యర్థుల పేర్లను ఈ రోజు అధికారికంగా ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో నూతనంగా ఏర్పాటైన మార్కాపురం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ సునీత తెలిపారు. మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనాతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఎన్నికల ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. జిల్లాలోని మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు మున్సిపాలిటీల పరిధిలోని వంద వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలియజేస్తూ..

వాయిస్ 34 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎన్నికల పర్యవేక్షణపై అధికారులతో ఆయన నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ చంద్ర పునేఠా మాట్లాడుతూ, ఎన్నికల పర్యవేక్షణ కోసం జిల్లాకు ఒకరి చొప్పున 28 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణను సులభతరం చేసేందుకు ఎన్నికల సంఘం పోల్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించిందని కమిషనర్ తెలిపారు. దీని ద్వారా ఓటర్ల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

---------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో జాతీయ మోటార్‌సైకిల్ ర్యాలీని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నిన్న ప్రారంభించారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' నినాదంతో ఈ ర్యాలీని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గుజరాత్ లోని కేవాడియా వరకు జరిగే మోటార్‌సైకిల్ ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ పోలీసు బృందం పాల్గొంటుందని తెలుపుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ కనకదుర్గమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో ఈ రోజు భక్తులకు దర్శనమిస్తున్నారు. దీనిపై మా ఆకాశవాణి ప్రతినిధి వివరాలను అందిస్తారు.

వాయిస్ 14 సెకన్లు

ఇదిలా ఉండగా శ్రీశైలక్షేత్రం దసరా మహోత్సవాలలో గత రాత్రి భ్రమరాంబికాదేవి స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే తెలంగాణలో బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఈ రోజు వేపకాయల బతుకమ్మ వేడుకను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న నాలుగు రోజులు చెదురుమదురుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ రోజు మేఘావృతమైన వాతావరణంతో పాటు పలు జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలోనూ ఈ రోజు నుంచి రానున్న రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండగ ప్రతీకని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో గత రాత్రి నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావుతో కలిసి కేంద్రమంత్రి నిన్న పాల్గొన్నారు.

=====================